

# దివ్యవనాలు - విశిష్టత 8



జె. వేణిమాధవి
నేచురలిస్ట్

(గత సంచిక తరువాయి)

*దశకూప సమో వాపీ*
*దశ వాపి సమో హ్రదః ।*
*దశ హ్రద సమః పుత్రో*
*దశ పుత్ర సమో ద్రుమః॥*

(మత్స్యపురాణం)

(పది బావులు ఒక దిగుడుబావితో సమానం. పది దిగుడు బావులు ఒక చెఱువుతో సమానం. పది చెఱువులు ఒక పుత్రుడితో సమానం. పదిమంది పుత్రులు ఒక మహావృక్షంతో సమానం.)

## వనలక్ష్మి



| | | |
|---|---|---|
| జూన్ 2 | : | 'కరవీర వ్రతం' |
| జూన్ 5 | : | 'ప్రపంచ పర్యావరణ దినోత్సవం' |
| జూన్ 6 | : | 'వనగౌరి వ్రతం' |
| జూన్ 15 | : | 'వటసావిత్రి వ్రతం' |

## మీ వృక్షం ఏది?

### 15. స్వాతి నక్షత్రం - మద్ది చెట్టు

| | | |
|---|---|---|
| సంస్కృత నామం | : | **'అర్జున'** |
| శాస్త్రీయ నామం | : | టెర్మినాలియా అర్జున |
| ప్రాంతీయ నామం | : | తెల్ల మద్ది చెట్టు |
| ఆంగ్ల నామం | : | అర్జున్ |



**ఔషధ గుణాలు :**

1) గాయాలను, చెవి నొప్పులను మాన్పుతుంది.
2) గుండె వ్యాధులను నివారిస్తుంది.
3) విరిగిన ఎముకలను మాన్పుటకు ఉపయోగపడుతుంది.
4) మూత్ర సంబంధ వ్యాధులు, విరోచనాలను తగ్గిస్తుంది.

### 16. విశాఖ నక్షత్రం - వెలగ చెట్టు

| | | |
|---|---|---|
| సంస్కృత నామం | : | **'కపిత'** |
| శాస్త్రీయ నామం | : | లైమోనియా ఆసిడిస్సిమ |
| ప్రాంతీయ నామం | : | వెలగ |
| ఆంగ్ల నామం | : | 'వుడ్ ఆపిల్' |



**ఔషధ గుణాలు :**

1) దగ్గు, ఊపిరితిత్తులు సంబంధిత వ్యాధులను తగ్గిస్తుంది.
2) వాంతులు, ఎక్కిళ్ళను నివారిస్తుంది.
3) కొన్నిరకాల గుండె వ్యాధులను నయం చేస్తుంది.
4) నోటి పూత, ఆకలి లేకపోవుటను నయం చేయుటకు ఉపయోగ పడుతుంది.



మనం చెప్పే సిద్ధాంతాల కోసం పోరాడటం సులభం. కానీ ఆ సిద్ధాంతాల ప్రకారం జీవించడమే కష్టం.

# వటసావిత్రి వ్రతం

**(జూన్ 15)**

దీనిని జ్యేష్ఠ శుద్ధ పూర్ణిమనాడు ఆచరిస్తారు. తన పాతివ్రత్య మహిమతో యమధర్మరాజు నుంచి తన భర్త ప్రాణాలను వెనక్కు తెచ్చుకున్న సావిత్రి పతిభక్తికి గుర్తుగా ఈ పండుగను జరుపుకుంటారు. తన భర్త సత్యవంతుడు చనిపోతే పవిత్రవృక్షమైన మర్రిచెట్టును భక్తి ప్రపత్తులతో పూజించింది సావిత్రీదేవి. ఆ మహిమతోనే ఆమె యమ ధర్మరాజు నుంచి తన భర్త ప్రాణాలను తిరిగి తెచ్చుకుంది.



సావిత్రీదేవి చేసినట్లుగా చెప్పే ఈ పూజను కొన్ని ప్రాంతాలలోని స్త్రీలు ప్రతి ఏటా నిర్వహిస్తూంటారు. పెళ్ళైన యువతులంతా వట సావిత్రీ వ్రతం నాడు కొత్త వస్త్రములు ధరించి, చుట్టుప్రక్కల వారితో కలిసి మర్రిచెట్టును భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. సింధూరంతో వట వృక్షాన్ని అలంకరించి, నూలుదారం పోగుల్ని చెట్టు చుట్టూ చుడుతూ 'నమో వైవస్వతాయ' అనే మంత్రమును పఠిస్తూ 108 ప్రదక్షిణలు చేస్తారు. మర్రివృక్షంలా తమ భర్తలు కూడా సుదీర్ఘకాలం జీవించి ఉండాలని వటసావిత్రీ వ్రతములో మహిళలు ఈ చెట్టుకు మొక్కు కుంటారు.

పూలు, గాజులు, పసుపు, కుంకుమలు వంటి సామగ్రితో అలం కరిస్తారు. పసుపు, కుంకుమలతో పూజిస్తారు. ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తారు. సువిశాలమైన, విస్తారమైన ఈ వృక్షం కొమ్మ కింద ఎలా నీడను పొందుతారో ఆ వృక్షంలా తమ భర్తలు కూడా కుటుం బానికంతా నీడనివ్వాలని కోరుకుంటూ ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. ఆ శక్తిని తమ భర్తలకు ఇవ్వవలసిందిగా ఆ సావిత్రీదేవిని ప్రార్థిస్తారు.

కొత్తగా పెళ్ళయిన స్త్రీలతో ఈ వ్రతాన్ని ప్రత్యేకించి చేయిస్తారు. తీపి పదార్థాలను నైవేద్యముగా పెడతారు. తీపి పదార్థాలను నైవేద్య ముగా పెడతారు. బంధుమిత్రులందరినీ ఈ వ్రతానికి రావలసిందిగా ఆహ్వానిస్తారు. బ్రాహ్మణ పురోహితులచే పూజ చేయించి, ఆ రోజంతా ఉపవాసము ఉంటారు. కొందరు చంద్రున్ని చూసేదాకా మంచినీరు కూడా తీసుకోరు. కొందరు ఒక పూట భోజనం చేస్తారు. మరికొందరు పండ్లు మాత్రమే తీసుకుంటారు.

వటవృక్షము అనగా మర్రిచెట్టు, అది దేవతా వృక్షం. ఈ చెట్టును త్రిమూర్తుల స్వరూపంగా భావిస్తారు. మర్రిచెట్టు వేళ్ళు బ్రహ్మకు, కాండము విష్ణువుకు, కొమ్మలు శివునికి నివాసస్థలములుగా మనం శ్రీమద్భగవద్గీతలో చూడవచ్చు. (మూలతో బ్రహ్మరూపాయ)

*(ఔషధులను వైద్యుని పర్యవేక్షణలో ఉపయోగించమనవి. ఈ వటసావిత్రీ వ్రతము ఎప్పటినుండి ఆరంభమైందో చెప్పే ప్రత్యేక దాఖలాలు లేవు. మనదేశంలోని బీహార్లో ఈ వటసావిత్రీ వ్రతమును 500 ఏళ్ళుగా ఆచరిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రాచీన మిథిలవాసులు కూడా దీనిని ఆచరించినట్లు ఆధారాలున్నాయట.)*

(సశేషం)

---

# సర్వమూ అమ్మే



అణువణువూ నిండి, విశ్వవ్యాప్తమైన ఆ మహాశక్తి మరో స్వరూపమే 'దుర్గ'. అణువణువే కాదు, పరమాణువు నుండి సమస్త చరాచర జగత్తునకు మూలభూతమైనది ఈ శక్తి. జగత్రస్రష్ట బ్రహ్మకు ప్రతీకయే దుర్గాశక్తి. 'దుర్గముడు' అనే రాక్షసుణ్ణి సంహరించినందువల్లనే దేవికి ఆ పేరు సార్థకమైనట్లు పురాణైతిహాసికుల, పరిశోధకుల అభిప్రాయము. ఆదిశక్తి జగన్మాత ఉపాసన (పూజ) వలన 'దుర్మతి' అంటే 'దుర్బుద్ధి' నశించి 'సద్బుద్ధి' కలుగుతుందని పురాణాల్లో చెప్పబడివుంది. ప్రస్తుతం మనం ప్రాపంచికమైన వైజ్ఞానిక పురోగతితో కూడిన పోటీ ప్రపంచంలో జీవిస్తున్నాం. అణు పరమాణువుల సంయోజనమైనదే ఈ యుగ శక్తి. అందువల్లనే ప్రతీ వ్యక్తి సర్వశక్తిమంతుడు కావాలని కోరుకొంటున్నాడు. ప్రతి మనిషి అంచెలంచెలుగా ఎదిగి జీవన సాఫల్యాన్ని పొందాలనుకుంటున్నాడు. కాని అతడు ఏదో ఒక స్థాయి వరకే చేరగలుగుతున్నాడు. అప్పుడతడు ఏదో దైవీ శక్తితో తన శక్తిని పెంచుకొని, దానివల్ల తన లక్ష్యాన్ని చేరగలుగుతున్నాడు. దయామయి దుర్గను శరణు పొందడం ద్వారా వచ్చే విషమ పరిస్థితుల నుండి బయటపడ గలుగుతున్నాడు. సమస్త విశ్వంలో చరాచర జగత్తులోను, బ్రహ్మాండమంతా వ్యాప్తమై ఉన్నదీ దుర్గాశక్తి. అందువల్లనే

శ్లో॥ సర్వరూపమయీదేవీ సర్వందేవీ మయం జగత్।
అతోహం విశ్వరూపాం తాం నమామి పరమేశ్వరీమ్॥ అని ఆర్యోక్తి.



ఇతరులు ఏమి అన్నా, అనుకున్నా లక్ష్యపెట్టకు, ధర్మం తప్పనిసరిగా ఆచరించు.